తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఘనంగా చెంగాళమ్మ కొలువు

వెంకటగిరి, జూన్ 30, ప్రభాతవార్త



పట్టణంలోని పల్లె వీధిలో ఘనంగా చెంగాలమ్మ కొలువును స్థానికులు నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను మట్టితో తయారుచేసి భక్తులు పూజించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వెంకటగిరి టౌన్ క్లబ్ అధ్యక్షుడు లక్కమనేని కోటేశ్వర రావు పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానికులు ఆయనను శాలువా కప్పి సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసారు.

## వైభవంగా కోటమ్మ గ్రామ ఉత్సవం

కోట, జూన్ 30 ప్రభాతవార్త



కోటలోని కోటమ్మ గ్రామ ఉత్సవల్లో భాగంగా రెండు రోజు ఆదివారం కోటమ్మ ఉత్స విగ్రహాన్ని వాహనంపై గ్రామ పురవీదుల్లో ఊరెగించారు. తప్పట్లు,మంగళవాయిద్యాల బాణా సంచా వేడుకలతో గంగపెట్టె,కోటమ్మ తల్లి పరివార దేవతల విగ్రహాలతో కన్నుల విందుగా గ్రామోత్స వం కొనసాగింది. ఈ వేడుకల్లో కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, గూడూరు శాసన సభ్యులు పాశిం సునిల్ కుమార్, జడ్డచర్ల శాసన సభ్యులు అరునిద, పాల్గొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు ప్రజా ప్రతినిధులకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గుడిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు తీర్ద ప్రసాదాల్ని అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి పర్యవేక్షణలో కోటమ్మ ఉత్స వాలు కనువిందుగా జరిగాయి.

# తప్పుకుంటారా!.... సాగనంపుతారా!!

### రాజీనామా చేయని పద్మావతి మహిళ వర్సిటీ ఉపకులపతి
### -టిటిడిలోనూ తప్పుకోని తెల్లఏనుగులు

తిరుపతి,జూన్ 30ప్రభాతవార్తన్యూస్‌నెట్‌వర్క్:

ప్రభుత్వ కార్యాలయాల్లో, విశ్వవిద్యాలయల్లో తెల్లఏనుగులుగా కొనసాగుతున్న వారందరూ తమ పదవులకు రాజీనామా చేసి వెళ్ళాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినా ...ఇంకా తిరుపతిలోని పద్మావతి మహిళ వర్సిటీ ఉపకులపతి కుర్చీని అంటిపెట్టుకుని ఉన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎస్వీ వేదవిశ్వవిద్యాలయం, ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతులు, రిజిస్ట్రార్‌లు తమతమ పదవుల నుండి తప్పుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులతో వాళ్ళంతా రాజీనామా చేశారు. అయితే పద్మావతి వర్సిటీ ఉపకులపతి మాత్రం ఈ పదవిలో కొనసాగుతున్నారు. తిరుపతి మహిళ వర్సిటీకి చెందిన ఆచార్య భారతి రెండేళ్ల ముందు పదవీవిరమణ చేసిన విశ్రాంత ఆచార్యులు. గత వైసిపి ప్రభుత్వం ,ఓ మంత్రి అండతో ఆమెను పద్మావతి మహిళ వర్సిటీలో ఉపకులపతిగా నియమించిన విషయం విదితమే. ఆమె ఆ పార్టీ నేతలకు దగ్గరగా వ్యవహరిస్తూ వాళ్ళు చెప్పిందే వేదంగా నిబంధనలు తుంగలో తొక్కి కొన్ని తప్పిదాలు చేశారనేది వర్సిటీవర్గాల్లో గుప్పుమంటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం కొలువుదీరడం, వైసిపి వీరవిధేయ తెల్ల ఏనుగులను సాగనంపాలని నిర్ణయించింది. పదవీవిరమణ చేసినా...మళ్ళీ గత వైసిపి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగి ,అడుగులకు మడుగులు వత్తిన కొందరు అధికారులకు ఇప్పుడు ఉద్వాసన తప్పలేదు. అలాగే టిటిడిలో,కొన్ని విభాగాల్లో ఇంకా కొందరు తెల్లఏనుగులు పదవుల్లో కొనసాగుతుండటం పెద్ద దుమారం రేపుతోంది. మరీ వీరందరి విషయంలో నేడు ప్రభుత్వం ఎలా స్పందించనుందనేది అందరిలోనూ టెన్షన్.

# నేడు పింఛన్ల పండగ



### 2.71 లక్షల మందికి రూ.181 కోట్ల పంపిణీకి సిద్ధం
### సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే పక్కాగా పెన్షన్

చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త:

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం జులై 1వ తేదీ పెంచిన పెన్షన్ మొత్తంను లబ్దిదారుల ఇంటికి పండుగ వాతావరణంలో చేర్పించడానికి సిద్ధం అయ్యింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వర్గాల వారీగా పెన్షన్ల మొత్తంను పెంచి లబ్దిదారులకు అందజేస్తామని హామీ ఇవ్వడంతో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. జులై 1 నుండి పెంచిన పెన్షన్‌ను లబ్దిదారులకు అందించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు సోమవారం ఉదయం 6 గంటల నుండి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో లబ్దిదారుల ఇంటి వద్దకు వెళ్ళి పెంచిన పెన్షన్ మొత్తంను లబ్దిదారులకు అందజేయనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 11 కేటగిరిలకు చెందిన వారి పెన్షన్ సొమ్మును రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచి జులై నెల నుండి చెల్లించనుంది. అలాగే జులై 1వ తేదీ ఆ నెల పెన్షన్ 4 వేల రూపాయలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి పెంచిన వెయ్యి రూపాయల సొమ్ము మూడు నెలలకు కలిపి 3 వేల రూపాయలు లబ్దిదారులకు ఇవ్వనుంది. ఈ మేరకు జులై 1వ తేదీ 11 కేటగిరిల పెన్షన్ లబ్దిదారులకు జులై నెల 4 వేల రూపాయల పెన్షన్‌తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు చెల్లించాల్సి న పెంచిన ఒక వెయ్యి రూపాయలు మొత్తం కలిపి 7 వేల రూపాయలు లబ్దిదారులకు సచివాలయ సిబ్బంది ఇవ్వనున్నారు. అలాగే 2వ కేటగిరిలో పాక్షిక దివ్యాంగులకు రూ.3 వేల నుండి రూ.6 వేలకు, 3వ కేటగిరిలో పూర్తి స్థాయి దివ్యాంగులకు రూ.5 వేల నుండి రూ.15 వేలు, 4వ కేటగిరిలోని కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి రూ.5 వేల నుండి రూ.15 వేల వరకు పెన్షన్ సొమ్ము అందజేయనున్నారు. జిల్లాలో మొత్తం 2,71,696 మందికి రూ.181 కోట్ల పెన్షన్ మొత్తంను సోమవారం నుండి లబ్దిదారులకు చెల్లించనున్నారు. ఇందులో వృద్ధ్యాప్య పెన్షన్ కింద 1,45,035 మంది లబ్దిదారులకు రూ.101.52 కోట్లు, నేతన్న పెన్షన్ కింద 2,572 మందికి రూ.1.80 కోట్లు, వితంతు పెన్షన్ కింద 2,572 మందికి రూ.42 కోట్లు, వికలాంగుల పెన్షన్ కింద 35,803 మందికి రూ.21.48 కోట్లు, అభయహస్తం కింద 11,311 మందికి రూ.56.56 లక్షలు, కల్లు గీత కార్మికులు 561 మందికి రూ.39 లక్షలు, 32 మంది హిజ్రాలకు రూ.2.24 లక్షలు, 5,761 ఒంటరి మహిళలకు రూ.4.03 కోట్లు, 249 మంది మత్స్యకారులకు రూ.17.43 లక్షలు, డప్పు కళాకారులు 6,290 మందికి రూ.4.40 కోట్లు, చర్మకారులు 796 మందికి రూ.55.72 లక్షలు, కళాకారుల పెన్షన్ కింద 70 మందికి రూ.4.90 లక్షలు, సైనిక్ వెల్ఫేర్ పెన్షన్ కింద 61 మందికి రూ.3.05 లక్షలు పెన్షన్ అందజేయనున్నారు.

### ఉదయం 6 గంటల నుండి పెన్షన్ పంపిణీ: కలెక్టర్



సోమవారం తెల్లవారుజాము 6 గంటల నుండి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పెన్షన్‌దారుల ఇంటి వద్దకే పెన్షన్ తీసుకెళ్ళి అందజేస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. పెన్షన్ పంపిణీకి ఎక్కడైనా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది కొరత వున్నట్లైతే అక్కడ అవసరమైన మేరకు ఇతర శాఖల సిబ్బందితో పెన్షన్లను పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. ఒకొక్క గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగి ద్వారా 50 ఇళ్ళ పెన్షన్ పంపిణీ కార్యక్రమంను పూర్తి చేస్తామన్నారు. సాధ్యమైన మేరకు ఒకేరోజు పెన్షన్ పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు.

### నేడు ఇళ్ళవద్దకే లబ్ధిదారులకు పెన్షన్
#### -రాష్ట్ర సమాచార మంత్రి పార్థసారథి

తిరుమల,జూన్ 30ప్రభాతవార్తప్రతినిధి:



జులై 1వతేదీ(నేడు)ఎన్టీఆర్ భరోసా ఫెన్షన్‌ను 4వేల రూపాయలు, దివ్యాంగుల ఫెన్షన్‌ను 15వేల రూపాయలు, తదితర ఫెన్షన్లు మొత్తం 65లక్షలు మందికి 4,500కోట్ల రూపాయలు లబ్ధిని ప్రజ లందరికీ ఇంటి వద్దకే వెళ్ళి ఇచ్చే కార్యక్రమం మొదలవుతుందని రాష్ట్రసమాచారమంత్రి పార్థసారథి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చసు పరిపాలన అందించే దిశగా తగిన శక్తిని ఇవ్వాలని, రాష్ట్రప్రజలను ఆశీర్వదించాలని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు.

# ఏం కష్టమొచ్చిందో ....

### కుటుంబ కలహాలతో తల్లీబిడ్డల ఆత్మహత్య





సోమల,జూన్ 30 ప్రభాతవార్త:

కుటుంబ కలహాలతో ఓ యువతి తన ఇద్దరి బిడ్డలతో సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమల మండలం ఆవులపల్లి పంచాయితీ పత్రపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చెందిన వెంకటరామయ్య కుమార్తె రాణిని 26 ఏడు సంవత్స రాల క్రితం రాయలపేటకు చెందిన దిలీప్ అనే వ్యక్తికి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలు కలిగారు. పిల్లలతో కలిసి రాణి గంగ జాతర కోసం శనివారం సాయంత్రం పత్రపల్లికి వచ్చింది. ఆదివారం ఉదయం బిడ్డలతో కలిసి పొలంకు వెళ్లిన రాణి బిడ్డలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పెద్ద కుమార్తె హిమ శ్రీ (6), రెండవ కుమార్తె జ్యోతి (3) సంవత్స రాలు బిడ్డలు మృతి చెందడం పై గ్రామంలో విషాదం నెలకొంది. ఎంత కష్టం వస్తే ఆ తల్లి ఇద్దరు బిడ్డలతో సహా ఆత్మహత్యకు పాల్పడిందోనని గ్రామ ప్రజలు విలపించడం కనిపించింది.

## శివయ్య పాలనా బాధ్యతలు స్వీకరించిన ఆర్‌జెసి

శ్రీకాళహస్తి,జూన్ 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం తిరుపతి ఆర్‌జెసి యన్.వి.యస్.ఎన్ మూర్తికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారి చేసారు. ఇక్కడ సుమారు 7 నెలల నుంచి ఇఓగా పని చేసిన డెప్యూటీ కలెక్టర్ ఎస్‌వి నాగేశ్వర రావు ఆదివారం ఉద్యోగ విరమణ చేసారు. ఆయన స్థానంలో కొత్త అధికారిగా తిరుపతి దేవాదాయశాఖ కు చెందిన మూర్తిని నియమించింది. ఆయన ఆదివారం ఇఓగా బాధ్యతలను స్వీకరించారు. మొదట ఆయన శ్రీజ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు.ఈ ఏడాది మహాశివరాత్రి బ్రహ్మోత్స వాల సందర్భంగా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా మూర్తి పని చేసారు. ఆదివారం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు వేదపండితులు ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ డెప్యూటీ ఇవో ఏకాంబరం స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.ఈ కార్యక్రమాల్లో ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ సతీష్ మాలిక్, ఆలయ సూపరింటెండెంట్,సిఎస్ఓ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్,పిఆర్ఓ నాగభూషణం నాయక్, రవి ఆలయాధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో 7 గొర్రెలు మృతి



యర్రావారిపాలెం జూన్ 30 ప్రభాతవార్త

మండల పరిధిలో విద్యుత్ షాక్‌తో ఏడు గొర్రెలు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. ఎల్లమంద పంచాయతీ ముక్కరవాండ్లపల్లె హరిజనవాడలో సిద్దరామయ్య,నాగమ్మలు గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు గొర్రెలు మేపేందుకు ఈ ఉదయం వాటిని బయటకు వదిలారు. ఈక్రమంలో ఇంటి వద్ద విద్యుత్ స్థంభానికి ఉన్న స్టేవైరును గొర్రెలు తాకుతూ వెళ్లడంతో ఏడు గొర్రెలు మృతి చెందాయి. దీనిని గమనించిన నాగమ్మ పరుగున వచ్చి స్టేవైరును పట్టుకోవడంతో ఆమెకు కూడా విద్యుత్‌షాక్ తగిలింది. దాదాపు లక్ష రూపాయల విలువైన గొర్రెలు మృతి చెందాయని వారు లబోదిబోమంటున్నారు. గతంలో కూడా ఈ వైరు అప్పుడప్పుడు విద్యుత్ షాక్ ఇస్తుంటుందని దానిని సరి చేయమని ఎర్రావారిపాలెం ఏఈకి, ఎల్లమంద లైన్‌మెన్‌కు ఫిర్యాదులు చేశామని వారు పట్టించుకోక పోవడంతో తాము నష్టపోయామని సిద్దరామయ్య కుటుంబ బోరున విలపిస్తోంది.

## 2 రోజుల పాటు కేజీ తోతాపురి రూ.24

### - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త:

జులై 1 నుండి 3వ తేదీ వరకు తోతాపురి మామిడి ధర కేజీ రూ.24కు తగ్గకుండా వుంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ తోతాపురి మామిడి ధర నియంత్రణపై రైతులు, పండ్ల గుజ్జు పరిశ్రమ యాజమనులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గతంలో తోతాపురి మామిడి కేజీ ధర రూ.30 నిర్ణయించడం జరిగిందని, ఈ విషయంలో ఎదురైన సమస్యలను పరిష్కరించడానికి జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడంలో భాగంగా రైతులు, పండ్ల గుజ్జు పరిశ్రమల యాజమానులతో సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్న అనంతరం ఈ రెండు రోజుల పాటు కేజీ తోతాపురి ధర రూ.24గా నిర్ణయించడం జరిగిందన్నారు. 3వ తేదీ సాయంత్రం మరోసారి రైతులు, గుజ్జు పరిశ్రమల యాజమానులతో సమావేశం నిర్వహించి మళ్ళీ ధర నిర్ణయం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, పండ్ల గుజ్జు పరిశ్రమల యాజమానులు రాఘవా చాట్లీ, మంజునాధ్, బాబి, జైన్ షమీర్, సోము, రైతు నాయకులు నాగేశ్వరరావు, వేణు, శ్రీనివాసరెడ్డి, లవకుమార్, వెంకట్‌రెడ్డి, రాజేంద్రనాయుడు, ఉమాచంద్రారెడ్డి, జయచంద్రచౌదరి తదితరులు పాల్గొన్నారు.

### టిడిపి ప్రభుత్వం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది



వార్త మెయిన్‌లో

పేదల ఇళ్లు కూల్చడం అమానుషం
నేను బిజెపిలోకి వెళ్ళుతున్నానని దుష్ప్రచారం
ఎంపి మిధున్‌రెడ్డి

## పుంగనూరులో ఎంపి మిధున్‌రెడ్డికు నిరసన సెగ

### -ఊరిలోనికి ఐదేళ్లు అనుమతించబోమని హెచ్చరిక
### -ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆందోళన



పుంగనూరు,జూన్ 30 ప్రభాతవార్త

రాజంపేట ఎంపి మిధున్‌రెడ్డి పట్టణానికి రావడంను నిరసిస్తూ పుంగనూరు తెలుగుదేశంపార్టీ నాయకులు,కార్యకర్తలు ఆదివారం ఉదయంపట్టణంలో ఆందోళన చేపట్టారు. ఆదివారం ఉదయం పుంగనూరు నియోజకవర్గ వైకాపా నాయకులతో సమావేశం నిర్వహిస్తానని ఎంపి మిధున్‌రెడ్డి శనివారం ప్రకటించారు. దీంతో ఆదివారం ఉదయం కల్లా పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆందోళనకు సిద్దమయ్యారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పెద్దఎత్తున చేరుకున్న నాయకులు ఎంపి మిధున్,ఎమ్మెల్యే పెద్దిరెడ్డి డౌన్‌డౌన్ అంటూ నిరసనలు వ్యక్తం చేశారు. వారు కనుక పట్టణంలోనికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈసందర్భంగా మదనపల్లి,చౌడేపల్లి మార్గాలలో రాకపోకలను అడ్డుకుని ఆందోళన చేశారు.దేశం నాయకుడు సయ్యద్‌సుహేల్ బాషా మాట్లాడుతూ పదేళ్లుగా పుంగనూరులో ప్రశాంతత లేకుండా చేసి, అన్నింటా అక్రమాలు,అవినీతికి పాల్పడిన పెద్దిరెడ్డి వ్యవహారాలపై దర్యాప్తు జరగాలన్నారు. ఐదువందల కుటుంబాలను నాశనం చేసి పోలీసు కేసులు పెట్టి దారుణంగా హింసించిన పెద్దిరెడ్డి, మిధున్‌రెడ్డిల వ్యవహారం ప్రజలు ఇంకా మరువలేదన్నారు. వారు పుంగనూరుకు చేసింది చాలని,ఇకపై వారు పుంగనూరుకు రాకుంటేనే ప్రజలు ప్రశాంతంగా ఉంటారన్నారు. పుంగనూరులో ఆందోళనకరంగా పరిసి ్థతులు ఉండడంతో తిరుపతి నుంచి మిధున్‌రెడ్డి రావడం సరికాదని పోలీసు వర్గాలు సమాచారం అందించాయని తెలుస్తోంది.దీంతో మిధున్‌రెడ్డిని పుంగనూరుకు వెళ్ళకుండా తిరుపతిలోని ఇంటిలోనే హౌస్ అరెస్టు చేసినట్లు తెలిసింది. అయితే ఈసందర్భంగా దేశం నాయకుడు సుహేల్ మాట్లాడుతూ మొన్నటి ఎన్నికలలో కొన్ని బూత్‌లలో పెద్దిరెడ్డి రిగ్గింగ్ చేసుకోవడంతోనే తృటిలో గెలవగలిరారని, పెద్ది రెడ్డి అక్రమాలపై తాము దర్యాప్తు కోరుతున్నట్లు ప్రకటించారు.

# భక్తుల బాధలు పట్టవా!



శ్రీకాళహస్తి నడిబొడ్డులోని కృష్ణారెడ్డి మండపం

### కృష్ణారెడ్డి మండపంలో దేవస్థానం సెంట్రల్ రిసెప్షన్‌కు అభ్యంతరమేమిటి?
### ఇబ్బందులు పడుతున్న భక్తులు - పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి,జూన్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ పాలన అస్తవ్యస్తంగా మారింది.ఇక్కడ భక్తుల సదుపాయాల కన్నా ఐదేళ్ళ పాటు పాలకుల భజనకే అధికారులు,సిబ్బంది పరిమితమయ్యారు. ఆలయంలో సంప్రదాయాలకు స్వస్తి. ఆచారాలకు మంగళం.విధి విధానాలకు తిలోదకాలు ఇచ్చారు. పాత సంప్రదాయాలకు వ్యవస్థలకు స్వస్తి చెప్పారు. పునరుద్దరించాల్సి న అధికారులు మనకెందుకులే అన్నట్లు వ్యవహారిస్తున్నారు.ఇందులో 'పట్టణ నడిబొడ్డులోని కృష్ణారెడ్డి మండపం' గతంలో దేవస్థానం కేంద్ర సమాచారకేంద్రంగా ఉండేది. ఇక్కడ కంప్యూటర్లు ఉండేవి. లాకర్లు ఉండేవి. రాత్రి కర్నాటక, తమిళనాడుల నుంచి వచ్చిన నిరుపేద భక్తులు ప్రైవేటు లాడ్జిల వలలో పడకుండా జాగ్రత్త పడేవారు. ఇక్కడ నుంచి భక్తులకు ఆలయంలో పూజలు,అభిషేకాల సమాచారం అందించారు.కానీ 2019 తరువాత ఇక్కడ 'దేవస్థానం సమాచారకేంద్రానికి 'తాళాలు తగిలించారు.ఎందుకు ఇలా చేసారో సమాధానం చెప్పె దిక్కులేదు. అనుభవంసమాచారం తెలిసిన సిబ్బంది పెదవి విప్పరు. తాత్కాలిక అధికారులు ఆలయంంలోని తమ ఛాంబర్, రాహుకేతుదోష నివారణ పూజలు, రాబడికే పరిశీలనకే పరిమితమౌతున్నారు. భక్తుల బాధలను పట్టించుకోవటం లేదు. శ్రీకాళహస్తీశ్వరాలయం గతంలో భక్తుల సేవే పరమావధిగా పని చేసేది. నాలుగుమాడావీదుల్లో ఓం కార నాదం.ఆర్‌టిసి బస్టాండు నుంచి ఉచిత బస్సు, రైల్వే స్టేషన్లో సమాచార కేంద్రం, అక్కడ నుంచి ఉచిత బస్సు ప్రతి రైలు వచ్చే సమయానికి అందుబాటులో ఉండేది.ఇక ఆలయానికి సమీపంలో సమాచార కేంద్రాలు నడిచేవి. కానీ ఐదేళ్ళుగా వ్యవస్థ గతి తప్పింది. సమాచార కేంద్రాలెక్కడున్నాయో అధికారులకు తెలియదు. ఉచిత బస్సు ఎలా నడుస్తుందో అంతుపట్టదు. ఇక వచ్చిన ప్రతి భక్తునికి సమాచారం అందించే సమాచార కేంద్రంను తాళాలు తగిలించి ఉన్నారు.మరి ఈ మండపం దేవస్థానంకు సంబంధించినదా? లేక ఎవరైనా ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిందా? దేవస్థానంకు సంబంధించినది అయితే అధికారులు ఎందుకు భక్తుల సదుపాయానికి ఉపయోగించరు? అనేది నేడు పట్టణంఓ హాట్ టాపిక్‌గా మారింది.

దేవస్థానంకు సంబంధించిన సత్రాల వివరాలు,ఇక్కడ బస సదుపాయం అవకాశం ఇక ఆన్‌లైన్ టిక్కెట్లు సదుపాయం అన్ని కృష్ణారెడ్డి మండపంలో ఏర్పాటు చేయవచ్చు. గతంలో ఉండేది. మరి ఎవరి వత్తిడితో ఈ మండపాన్ని మూసి పెట్టారో ఎవ్వరికి అంతుపట్టడం లేదు. నిష్పక్షపాతంగా వ్యవహారించాల్సి న అధికారులు రాజకీయ నాయకుల వత్తిడికి లొంగి వ్యవస్థను అస్తవ్యస్తం చేయటం పట్ల శ్రీకాళహస్తి ప్రజల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది.దేవస్థానంకు ఉచిత బస్సు లున్నాయి. కృష్ణారెడ్డి మండపంలో కంప్యూటర్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఇక్కడ నుంచే బస సదుపాయాలను ఆపరేట్ చేయవచ్చు.కానీ ఎందుకు చేపట్టడం లేదో ఆ భోళాశంకరునికే ఎరుక.ఇక్కడే గదులు కేటాయించి సత్రాల వద్దకు ఉచిత బస్సు ల్లో చేరవేయవచ్చు. కానీ అలా జరగదు.ముఖ్యంగా శని,ఆది వారాల్లో ఇక్కడకు వచ్చేభక్తులు బస సదుపాయం కోసం తల్లడిల్లిపోతారు.

## అక్రమ క్వారీ నిలుపుదల చేయాలని గ్రామస్తులు వార్నింగ్



పాలసముద్రం, జూన్ 30 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ పరిసరాల్లో వున్న ఓ క్వారీని నిలుపుదల చేయాలని వనదుర్గాపురం గ్రామస్తులు క్వారీ యాజమానులకు ఆదివారం వార్నింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు క్వారీ నిర్వహకులతో మాట్లాడుతూ అధికారులు మీకు ఎంత విస్తీర్ణం క్వారీ చేయడానికి మంజూరు చేశారు! మీరు ఎంత విస్తీర్ణంలో క్వారీని విస్తరించారు! అని నిలదీశారు. క్వారీ హద్దులను చెరిపివేసి ఇతర ప్రభుత్వ భూముల్లో క్వారీని విస్తరించి అటు ప్రభుత్వానికి, ఇటు పంచాయతీకి ఎలాంటి డబ్బులు చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. క్వారీ నిర్వాహకులు కొంతమంది అధికారులను గుప్పిట్లో పెట్టుకొని వనదుర్గాపురం పరిసర ప్రాంతాలను ధ్వంసం చేస్తున్నారని ఇకపై దీనిని ఉపేక్షించేది లేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఇకపై క్వారీని నిర్వహిస్తే దాడులకు పాల్పడుతామని గ్రామస్తులు హెచ్చరించడంతో క్వారీ నిర్వాహకులు తాత్కాలికంగా పనులు నిలుపుదల చేశారు.

## నేటినుంచి గ్రామాల్లో రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

కుప్పంరూరల్, జూన్ 30 ప్రభాతవార్త

కుప్పం మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో సోమవారం నుంచి నాలుగు రోజులపాటు రెవెన్యూ, భూ సర్వే సమస్యలపై ప్రజలు, రైతులనుంచి ఫిరా ్యదులు స్వీకరించడం జరుగుతుందని తహశీల్దార్ హరికు మా ర్తెలిపారు. విఆర్వోలు, విఆర్ఎలుగ్రామాల్లోఅందుబాటులోఉండి ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారన్నా రు.

## ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి కమిటీ ఏర్పాటు

కుప్పంరూరల్, జూన్ 30 ప్రభాతవార్త



కుప్పం మున్సి పల్ పరిధిలో ఉన్న ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి సంబంధించి ఆదివారం తెదేపా రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, దేశం నేతలు, క్రీడాకారుల అధ్వర్యంలో నూతన కమి టీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా డా॥ సురేష్‌బాబు మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి సిఎం చంద్ర బాబునాయుడు గతంలోనే ఎన్టీఆర్ స్టేడియ ంను నిర్మింపజేశారన్నారు. అయితే ఐదేళ్లకాలంగా స్టేడియం ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. కుప్పంలో స్టేడియం అభివృద్ధికి సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు క్రీడాకారులకు శిక్షణ నిమిత్తం పిఇటిలు, కోచ్‌లను ఏర్పాటుచేశామన్నారు. పిడిగా శేఖర్, కోచ్‌గా లెనిన్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. నేతలు డా॥ వెంకటేష్, కన్నన్, అప్పు, కౌన్సి లర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డా॥ మహేష్, క్రీడాకారులు పాల్గొన్నారు

## నిఘంటువుల తయారీ సమన్వయ కర్తగా ఆచార్య కేశవమూర్తి

కుప్పం, జూన్ 30 ప్రభాతవార్త



కమీషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నిక్ టెర్మినాలజీ విద్యామంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం హిందీ ఇతర భారతీయ భాషల అభివృద్ధికి రూపొందించే నిఘంటువుల తయారీ సమన్వయ కర్తగా ద్రవిడ వర్సిటీకి చెందిన ఆచార్య కేశవమూర్తి నియమితులయ్యారు. ప్రతి ఆంగ్ల నిర్వచనానికి తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో సమానార్థక నిఘంటువులను రూపొందించనున్నారు. వీటి తయారీకి కేశవమూర్తి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈయన నియామకం పట్ల పలువురుహర్షం వ్యక్తం చేశారు.

## పంద్యాలమడుగులో ఘనంగా మునేశ్వర దేవర

రామకుప్పం, జూన్ 30 ప్రభాతవార్త



మండలంలోని పంద్యాలమడుగులో ఆదివారం మునీశ్వర దేవరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారి ప్రతిమకు పూలతో సుంద రంగా అలంకరించారు. అనంతరం మహిళలు, గ్రామ స్తులు గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి స్వామివారి ప్రతి మకు పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోండి

రామకుప్పం, జూన్ 30 ప్రభాతవార్త

రామకుప్పం శివార్లలో ఉన్న శాంతినికేతన్ పాఠశాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పిఎల్ఆర్ ప్రాజెక్టు లిమిటెడ్ కంపెనీకి చెందిన సుమో వాహనంలో విద్యార్థులను తరలిసుతన్నారు. పాఠశాలకు సరైన భవనాలు, బాత్రూములు, ప్రహరీగోడ లేకపాగా అర్హత లేని ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

## వ్యక్తి ఆత్మహత్య



పెద్దపంజాణి జూన్30 ప్రభాతవార్త :

మండలంలోని చలమంగళం–భద్రాచలం మార్గంమధ్యలో కౌండిన్యనది పరివాహక ప్రాంతంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనంమేరకు వివరాలిలా.. చౌడేపల్లి మండలం కోటూరు గ్రామానికి చెందిన ఎస్. రజాక్‌సాబ్ కుమారుడు ఎస్. ఇమ్రాన్(29)కి పెద్దపంజాణి మండలం బద్రాచలం గ్రామానికి చెందిన షబానతో గతంలో పెద్దలు వివాహం జరిపించారు. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం. ఇమ్రాన్ గుజిరి వ్యాపారంతోపాటు కూలీపనులు చేసుకుని కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నేపథ్యంలో మద్యానికి అలవాటుపడిన ఇమ్రాన్ కుటుంబంలో కలహాలు తరచూ జరిగేవి. భార్యభర్తల మధ్య ఘర్షణలు సైతం చోటుచేసుకునేవి. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తిచెందిన ఇమ్రాన్ శనివారం సాయంత్రం ఇంటునుండి బయటికివచ్చేసాడు. రాత్రి ఇంటికి వెళ్ళకపోగా కుటుంబీకులు చుట్టుపక్కల గాలించినా ఫలితంలేకపోయింది అయితే ఆధివారం ఉదయం కౌండిన్య నదీప్రాంతంలో ఇమ్రాన్ ఉరివేసుకుని మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసుకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పలమనేరు ఆర్టీసి డిపోకు పూర్వ వైభవం తీసుకురావాలి

–తరలిపోయిన సర్వీసులు తిరిగిరావాలి : ఎమ్మెల్యే

పలమనేరు, జూన్ 30, ప్రభాతవార్త:

పలమనేరు ఆర్టీసి డిపో నుండి తరలివెళ్లిన ఆర్టీసి బస్సు సర్వీసులను తిరిగి తీసుకురావాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్థానిక ఆర్టీసి డిపో మేనేజర్ స్వామికు సూచించారు. స్థానిక కార్యాలయంలో ఆయన ఆర్టీసి అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో స్థానిక డిపోలో ఉన్న సర్వీసులను పుంగనూరుకు తరలించారని వాటిని తిరిగి స్థానిక డిపోకు తీసుకురావాలని సూచించారు. డిపోకు అదనంగా కావలసిన ఎక్స్‌ప్రెస్ సర్వీసుపై ఉన్నతాధికారులతో త్వరలో మాట్లాడనున్నామన్నారు. డిపో నిర్వీర్యం కాకుండా పూర్వవైభవం తీసుకురావడానికి తనతోపాటు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. స్థానిక డిపోకు కావలసిన సదుపాయాలు, అదనపు సర్వీసులపై ఆధికారులతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహాభారత ఉత్సవాలకు హాజరైన నూకతోటి రాజేష్

వెదురుకుప్పం, జూన్ 30 ప్రభాతవార్త :

చవటగుంట మహాభారత ఉత్సవాలకు సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నూకతోటి రాజేష్ ఆదివారం హాజరై, ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయం వద్దకు చేరుకున్న రాజేష్‌కుఆలయ ధర్మకర్త రాధాకృష్ణా రెడ్డి, కార్యనిర్వహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పురోహితులచే అమ్మ వారి ఆలయంలో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట జ్ఞానకొండా రెడ్డి, రామయ్య, ధనంజేయులు రెడ్డి, హనుమంత రెడ్డి, ఉమాపతి రెడ్డి, పురంధర్ రెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్ పాలనతోనే పోలవరం విధ్వంసం

– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్

చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త:

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ళ పాలనలోనే పోలవరం ప్రాజెక్టు విధ్వంసానికి గురైందని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ ధ్వసమెత్తారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలవరం నేటి స్థితికి కర్త, కర్మ, క్రియ అన్ని మాజీ సిఎం వైఎస్ జగన్ అన్నారు. ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు పోలవరం ప్రస్తుత వాస్తవ స్థితిని ప్రజల ముందు వుంచడంతో దీనికి సమాధానం చెప్పకుండా వైకాపా నాయకులు మొఖం చాటేసి తమ పత్రికలో అతస్యప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త:



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే గురజాల ఆయ నకు పుష్పగుచ్చం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల కలెక్టర్‌తో మాట్లాడుతూ మామిడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసకోవాలని కోరారు. అలాగే చిత్తూరు నగర సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## షికారీల సేద్యానికి భూస్వాముల అడ్డంకులు



–జిల్లా కలెక్టర్‌కు, చల్లాబాబుకు బాధితుల మొర

పుంగనూరు, జూన్ 30 ప్రభాతవార్త

మండలంలోని ఈడిగపల్లికు చెందిన షికారి పాలెంకు చెందిన ప్రజలు తమ వ్యవసాయ పొలాలకు వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నామని పేర్కొంటూ జిల్లా కలెక్టర్‌కు, తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి చల్లాబాబుకు ఫిర్యాదు లేఖ పంపారు. వివరాలిలా ఉన్నా యి. ఎంసిపల్లి పంచాయతీ పరిధిలోని షికారిపాలెంలో వంద వరకు కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి ప్రభుత్వాలు నివాస గృహాలతో పాటూ ప్రతి కుటుంబానికీ అక్కడ కొండగుట్టల వద్ద వ్యవసాయపొలాలను కూడా అందచేసింది. కూలీనాలీ చేసుకుంటూ వీలు చిక్కినపుడు వ్యవసాయం చేసుకుంటూ వీరు జీవిస్తున్నారు. తమ పొలాలను ఆనుకునే ఉన్న భూస్వాములు ఇటీవల కాలం నుంచి తాము తమ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు వీలు లేకుండా ఆక్రమణ చేశారని ఆరోపించారు. భూస్వాముల ఆక్రమ ణల వల్ల తమ పొలాలకు వెళ్ళడానికి వంకలోనే నడచివెళ్ళాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. తమకు న్యాయబద్దంగా ఉన్న పొలాల వరకు దారి సమస్యను పరిష్కరించాలని వారు వేడుకొంటున్నారు.

## దళితోద్ధారకుడికి రుణపడి ఉంటాం

యర్రావారిపాలెం, జూన్ 30 ప్రభాతవార్త



దళితుల పక్షపాతి, గొప ్ప దార్శనికుడు అయిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తాము రుణ పడి ఉంటామని డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జూలై1వ తేదీ నుంచి రూ. 4వేలు పింఛన్లు అందజేస్తున్నందున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి డప్పు కళా కారుడు, ప్రతి చర్మకారుడు ముఖ్యంత్రికి రుణపడి ఉంటారన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు పరచి నిధులు దుర్వినియోగం కాకుండా అభివృద్ధి చేయాలన్నారు. దేవాదాయ శాఖకు అనుబంధంగా ఉన్న ప్రతి దేవాలయంలో ఉత్సవాల సందర్భంగా డప్పు కళాకారులను భాగస్వామ్యులను చేయాలన్నారు.

## ఎమ్మెల్యే దృష్టికి ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యలు



చిత్తూరురూరల్, జూన్ 30 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘ ఉమ్మడి చిత్తూరు జిల్లా శాఖ ఉద్యోగులు ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగ న్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలసి ఆయనను దు శ్శాలువతో సత్కరించారు. ప్రభుత్వ వాహన డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగాస్పందించిన ఎమ్మెల్యే ప్రభు త్వంతోచర్చించిత్వరలోపరిష్కారం చేస్తానని హామి ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు పన్నీర్‌సెల్వం, గౌరవ అధ్యక్షుడు షణ్ముగం, ముఖ్యసలహాదారుడు రామన్న, జనరల్ సెక్రటరీ రోషన్‌భాష, పబ్లిసిటీ సెక్రటరీ మురాద్‌భాష, కోశాధికారి బాలాజీ, వైస్‌ప్రెసిడెంట్ అన్నామలై తదితరులు వున్నారు.

## ఎమ్మెల్యేచే కాణిపాకం-బంగారుపాళ్యం బస్సు సర్వీసు ప్రారంభం

తవణంపల్లె, జూన్ 30 ప్రభాతవార్త:



ప్రయాణీకుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన కాణిపాకం–బంగారుపాళ్యం(వయా అరగొం డ, ఎ.గొల్లపల్లె) నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఆదివారం పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ జెండా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన ఎ.గొల్లపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎ.గొల్లపల్లె పరిసర గ్రామాల ప్రజలు బస్సు సర్వీసు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి రాగానే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల మాజీ ఎడ్పీటీసీలు వెంకటేవ్వర చౌదరి, కోదండయ్య, మాజీ ఎంపీపీ సరళకుమారి, నాయకులు దిలీప్, జయప్రకాస్‌నాయుడు, ప్రవీన్‌నా

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## బ్రాహ్మణ సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా విశ్వప్రసాద్

వెంకటగిరి, జూన్ 30, ప్రభాతవార్త



వెంకటగిరి నియోజకవర్గ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగాకె. విశ్వప్రసాద్ (విశ్వం) ఏకగ్రీవంగా ఎన్ని కయ్యాడు. వెంకటగిరిలోని శంకర మఠంలో బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో ఉపాధ్యక్షులుగాశ్రీనివాసులు, శ్రీరామ్మూర్తి, శరవణ, ప్రధానకార్యదర్శిగామణికంఠశర్మసంయుక్త కార్యదర్శిగా పి. శివ, సంతోష్, మహర్షి తదితరులు ఎన్నికయ్యారు. సమావేశంలో పలు అంశాలను చర్చించారు.

## ఖజానాను ఖాళీ చేసిన వైసిపి ప్రభుత్వం

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, జూన్ 30, ప్రభాతవార్త



వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. బాలాయ పల్లి మండలం చిలమనూరు గ్రామంలో ఎమ్మెల్యేగా రామకృష్ణ విజయం సాధించిన సందర్భంగా విజ యోత్సవ ర్యాలీ సన్మానం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. వేల కోట్ల రూపాయలను వైసిపి ప్రభుత్వం అప్పుచేసి రాష్ట్రాన్ని దివాలా దించిందని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని చెప్పారు. ఒకటో తేది పెన్షన్లు ఇంటి వద్దకే చేరుస్తారని చెప్పారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం అందరికీ పెన్షన్లు పెంచి అదనంగా అరియర్స్ 3000 రూపాయిలు ఇస్తున్నట్లు తెలిపారు. తెలుగుగంగ నీరు చెరువులకు ఇవ్వాలని రైతులు ఆయనను కోరారు. ఐ పవర్ విద్యుత్ లైను ఊరు మీద వెళ్తుందని పక్కకు మార్చాలని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇంకా అనేక సమస్యలను ఎమ్మె ల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. మాజీ ఏఎంసి చైర్మన్లు భాస్కర్ రావు, సిసి నాయుడు, కోటేశ్వర్ రెడ్డి, నాయకులు ప్రభాకర్ నాయుడు, రాజగోపాల్ నాయుడు, కళ్యాణ్ రెడ్డి, కోటేశ్వర్ గౌడ్, గురువేంద్ర సివికె నాయుడు, సత్యం నాయుడు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సుబ్రమణ్యం

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి, జూన్ 30, ప్రభాతవార్త

ఉపాధ్యాయ వృత్తికి పునుగోటి సుబ్ర మణ్యం వన్నె తెచ్చారని ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణ తెలిపారు. ఉపాధ్యా యునిగా పనిచేసి పదవి విరమణ చేసిన సుబ్రమణ్యం ఘనంగా ఎమ్మెల్యే కురు గొండ్ల, మాజీ ఎమ్మెల్యే సాయి కృషి యాచేంద్ర ఉపాధ్యాయులు స్థానికులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందారని తెలిపారు. ఆయన ఎక్కడ పని చేసిన పాఠశాల అభివృద్ధికి తన సొంత నిధులను ఖర్చు చేసేవాడని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే సాయి కృషి యాచేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన ఉద్యోగిగా సుబ్రమణ్యం గుర్తింపు తెచ్చుకున్నట్లు తెలిపారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, బాబయ్య, మాజీ కౌన్సి లర్ విశ్వనాథం, టౌన్ క్లబ్ అధ్యక్షుడు లక్కమనేని కోటేశ్వర రావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు, మాజీ మున్సి పల్ వైస్ చైర్మన్ రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సన్నారెడ్డి పుట్టినరోజు వేడుకలు

చిట్టమూరు, జూన్ 30 ప్రభాతవార్త

చిట్టమూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దిల గురుమూర్తి, వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య, వైసీపీ యువత అధ్యక్షులు మాచిరెడ్డి సుధీర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు శ్రీనివాసులురెడ్డి అభిమానులు తరలివచ్చి ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శేషురెడ్డికి పలువురు పరామర్శ

చిట్టమూరు, జూన్ 30 ప్రభాతవార్త



చిట్టమూరు మండలం మల్లాం గ్రామ పంచాయతీ లోని వైసీపీ నాయకులు దువ్వూరు శేషురెడ్డి తల్లి దువ్వూరు ఈశ్వరమ్మ ఇటీవల మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పలువురు ప్రముఖ నాయకులు శేషురెడ్డిని పరామర్శించారు. తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కు మార్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## డయేరియా బాధితుడిని పరామర్శించిన సిపిఎం నాయకులు

గూడూరు, జూన్ 30, ప్రభాతవార్త



గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాంతంలో నివసిస్తున్న బొమ్మిడి వెంకటేశ్వర్లు కలుషిత నీరు తాగి ఆసుపత్రి పాలైయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు గూడూరు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితున్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఇటీవల చెన్నూరులోని గురుకుల పాఠశాలలో కలుషిత నీరు తాగడం వలన విద్యార్థులు అస్వస్థతకు గురైయ్యారన్నారు. చెన్నూరులోని సినిమా హాల్ ప్రాంతంలో నివాసం ఉంటున్న బొమ్మిడి వెంకటేశ్వర్లు మున్సి పాలిటీ వారు సప్లై చేసే కుళాయిలోని నీరు తాగడం వల్ల అస్వస్థతకు గురైయ్యారన్నారు. చెన్నూరులోని సినిమా హాల్ ప్రాంతంలో నివాసం ఉంటున్న బొమ్మిడి వెంకటేశ్వర్లు మున్సి పాలిటీ వారు సప్లై చేసే కుళాయిలోని నీరు తాగడం వల్ల అస్వస్థతకు గురైనాడని, వెంటనే ఆసుపత్రికి తన కుటుంబ సభ్యులు తరలించి చికిత్స చేస్తున్నారన్నారు. పురపాలక అధికారులు ఇకనైనా త్రాగునీటిపై దృష్టి సారించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, అడపాల ప్రసాద్, గుర్రం రమణయ్య, ఆర్. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఫల సరుకులు పంపిణీ

గూడూరు, జూన్ 30, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ నంద సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు ఫల సరుకులు పంపిణీ చేశారు. ప్రతి నెల క్రమం తప్ప కుండా 25 మంది పేదలకు ఫల సరుకులను అందజే శారు. దాతగా గున్నం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు గున్నం రెడ్డి మధుసూధన్ రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలన్నారు. సనత్ కుమార్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, రాఘవరెడ్డి, హరినాధ్ రెడ్డి, ప్రహ్లాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సేవలో సహకరించిన అందరికి ధన్యవాదాలు

గూడూరు, జూన్ 30, ప్రభాతవవార్త

2023 – 24 సంవత్సరానికి గాను కోస్టల్ జోన్‌లో ఉన్న గూడూరు వెస్ట్ రోటరీ క్లబ్‌లకు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ పదవీ కాలం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ద్వారా పేద ప్రజలకు సేవ చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా 2024 – 25 సంవత్సరానికి ఎన్నిక కాబడిన కోస్టల్ పరిధిలోని ఐదు క్లబ్‌ల నూతన అధ్యక్ష కార్యదర్శులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## గురుకుల పాఠశాలను తనిఖీచేసిన ఎమ్మెల్యే ...

**దొరవారిసత్రం, జూన్ 30 ప్రభాతవార్త ;** దొరవారిసత్రం బిసిగురుకుల పాఠశాలను సూళ్ళూరుపేట శాసనసభ్యులు నెలవల విజయశ్రీ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో చదువుతున్న విద్యార్థులకు వసతులు సరిగా కల్పించడంలేదని సమాచ్చారం తెలుసుకొన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆపార్టీ నాయకులతో కలిసి వసతి గృహలను పరిశీలించారు. గురుకుల, ఎస్సీ బాలికల వసతిగృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బోజనశాల, మరుగుదొడ్లు, వంటగది, అద్వానంగా ఉండటంతో కాలేజి ప్రిన్సి పాల్‌పై ఆవేదన వ్యక్తం చేశారు. వసతిగృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కలిపంచకపోతే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. విద్యార్థుల విద్యా, ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట తెదేపా మండల పార్టీఅధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, మాజీ ఎంపిటిసి బందిల ఉదయ్‌కుమార్, యాగాని శేఖర్, పోలీసులు, తదితరులు ఉన్నారు.

## గూడూరు క్రీడలకు పుట్టినిల్లు

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు, జూన్ 30, ప్రభాతవార్త



గూడూరు పట్టణం క్రీడలకు పుట్టి నిల్లుగా విరాజిల్లుతోందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. స్వర్గీయ అల్లూరు ఆదిశేషారెడ్డి 107వ జయంతి సందర్భంగా గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గూడూరు పట్టణం లోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రారంభించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్వర్గీయ అల్లూరు ఆదిశేషారెడ్డి సహకారంతో ప్రతి సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్న అనేక మంది క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించి గూడూరు ప్రతిష్టలను పెంపొందించారని పేర్కొన్నారు. స్థానికుడైన తనకు గూడూరు అభివృద్ధి ముఖ్యమని ఈ క్రమంలో స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు డాక్టర్ జనార్ధన్ రెడ్డి, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, జానకిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్లు పంపిణీకి సర్వం సిద్ధం

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 30, ప్రభాతవార్త

ఎన్నికల సమయంలో ఎన్‌డిఏ కూటమి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ జూలై 1వ తేది ఉదయం 6 గంటలకు పెన్షన్ల మహోత్సవం కార్యక్రమం ప్రారంభమవుతుందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు జూలై 1వ తేదిన సచివాలయం సిబ్బంది ద్వారా పెన్షన్లను ఇంటి వద్దే పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ బిజెపి పార్టీల నాయకులు ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అందువల్ల పెంచిన పెన్షన్ అన్ని పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఇంటింటికి వెళ్లి నిర్వహించాలని ఆయన ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కూడా పెన్షన్ దారుల ఇంటికి నేరుగా వెళ్లి పెన్షన్ అందజేస్తున్నారని పేర్కొన్నారు.

## ఎంపి వేమిరెడ్డి దంపతులకు ఘనస్వాగతం

కోట, జూన్ 30 ప్రభాతవార్త

కోటలో కోటమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోటకు చేరుకున్నారు. ముందుగా ఆయనకు కోట క్రాస్ రోడ్డు నుంచి యువ నాయకుడు వాకా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు బైక్‌లతో ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. అనంతరం కోటమ్మ ఆలయంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు కు ఆలయ అర్చకులు ముందుగా పూర్ణ కుంభంతో స్వాగతం పిలికారు అనంతరం గుడిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు తీర్ధ ప్రసాదాల్ని అందజేశారు. ఆయన వెంట ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి ఉన్నారు.

## డాక్టర్ రవి కుమార్‌కు ఉత్తమ పురస్కారం

కోట, జూన్ 30 ప్రభాతవార్త



కోటకు చెందిన డాక్టర్ మద్దూరు రవికుమార్ ఉత్తమ పురస్కరానికి ఎంపికైయ్యారు. నేడు (సోమవారం) డాక్టర్స్‌డే సందర్భంగా ఆయన ఈ పురస్కారంను అందు కోనున్నారు. 1994లో దుగ్గరాజపట్నంలోని రెడ్ క్రాస్ ఆసుపత్రిలో ఆయన సేవలు అందించారు. అనంతరం మల్లాం, వాకాడు, కోట, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు ఎన్నో రకాల సేవలు అందించారు. ప్రాణాపాయ స్దితిలో ఉన్న ఎంతో మందికి ఆయన తన వైద్యంతో ప్రాణం పోసి బతికించారని చెబుతుంటారు. ఆయన గూడూరు ఏరియా ఆసుపత్రిలో వైద్యాధికారిగా ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం డాక్టర్స్ డే ని పురస్కారించుకని ఆయనకు ఉత్తమ వైద్యాధికారిగా అవార్డును ప్రకటించింది. ఈసందర్భంగా ఆయన ప్రభాతవార్త తో మాట్లాడుతూ పేదలకు సేవ చేసే అదృష్టం తనకు లభించి నందుకు ఏంతో సంతృప్తి కలుగుతుందన్నారు. సేవా రంగంలో ఉన్న తృప్తి ఏరంగంలోను లభించద న్నారు. వైద్యపరంగా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా తను మూడు దశాబ్దాలగా పైగా గూడూరు నియోజకవర్గంలోవివిధప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలును అందిస్తున్నాని మద్దూరు రవి కుమార్ చెప్పారు.

# గ్రావెల్ క్వారీపై సమగ్ర విచారణ నిర్వహించి చర్యలు తీసుకోండి

మండల మీట్‌లో ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

విజయపురం, జూన్ 30 ప్రభాతవార్త : మండలంలో గతంలో జరిగిన గ్రావెల్ క్వారీలపై సమగ్ర విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రమైన విజయపురం ఎంపిడిఒ కార్యాలయంలో జమున అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న భానుప్రకాశ్‌ను అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రావెల్, మట్టిని విచ్చలవిడిగా తమిళనాడుకు తరలించారని, ఒక సర్వే నెంబరులో అనుమతి తీసుకుని మరొక సర్వే నెంబరులో మట్టిని యధేచ్ఛగా తరలించారని తెలిపారు. ఈ విషయమై సమగ్ర విచారణ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండలంలో



ఎవరైనా అక్రమంగా గ్రావెల్, మట్టిని తరలిస్తే వారిపై కూడా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని చివరకు అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మండల పరిషత్ నిధులు దుర్వినియోగమయ్యాయని ఫిర్యాదులు వున్నాయని, వాటిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని సూచిం చారు. మండలంలో మంచినీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై వుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ తెలియాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్పీ నరసింహామూర్తి, ఎంపిడిఒ బ్రహ్మయ్య, తహశీల్దారు మల్లిఖార్జునరావు, జడ్పీటిసి రేవతి, వైద్యాధికారి డాక్టర్ సోమశేఖర్, ఎఒ రజనీకుమారి, ఎఇలు వీరభద్రం, చంద్రబాబు, ప్రశాంత్, సిడిపిఒ కృష్ణవేణి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన విద్యతో పాటు జీవిత శిక్షణకు ప్రాధాన్యత

శ్రీకాళహస్తి, జూన్ 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యతో పాటు జీవితానికి ఉపయోగపడే శిక్షణను ఇవ్వటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూధనరెడ్డి అన్నారు. ఆదివారం ప్రైవేటు స్కూళ్ల సంఘం సర్వసభ్యసమావేశం ఆక్స్ ఫర్డ్ కళాశాల ఆవరణలో మధుసూధనరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యతో పాటు జీవితానికి ఉపయోగపడే అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నామని ఈ అంశాలను ప్రతి పాఠశాల నిర్వాహకులు పాటించాలని సూచించారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులచే విద్యార్థులను తీర్చిదిద్దటంలో తమ వంతు ప్రయత్నం చేస్తున్న తమకు ఎన్నో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు.

**ఉపాధ్యాయులకు సత్కారం:**

భవాని స్కూల్ నిర్వహిస్తున్న చిలకా రంగయ్యను సత్కరించారు. ఆయన నెల్లూరుజిల్లా నాయుడుపేటకు సమీపంలోనిమేనకూరు పాఠశాలలో పని చేసి ఉద్యోగ విరమణ చేసారు. పట్టణంలో ఆయన భవాని స్కూల్‌నునిర్వహిస్తూకరస్పాండెంట్‌గా ఉన్నారు. ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదనరెడ్డి, ఉపాధ్యాక్షుడు కాయం సుబ్బరామిరెడ్డి, ఢిల్లిబాబు, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాదికారి నెల్లూరు విద్యాసాగర్‌బాబు సభ్యులు పాల్గొన్నారు.

## మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బిజెపి నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 30 ప్రభాతవార్త



పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా. ఆనంద్‌తో పాటు పలువురు బిజెపి నాయకులు ప్రధాని మూడోసారి అయిన తర్వాత మోడీ తొలిసారి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయంలో సప్తగిరి డిడి ఛానల్ నందు పార్టీ కార్యకర్తలు, నాయకులు వీక్షించారు. సమాజంలోని పౌరులు ప్రతిభను గుర్తించి జాతాఇతో అనుబంధం ఏర్పరచుకుని జాతీయ ఇష్టాగోష్టి కార్యక్రమాన్ని సాధారణ ఎన్నికల తర్వాత మూడోసారి ప్రధాన మంత్రి అయిన తర్వాత 111వ ఎపిసోడు కార్యక్రామన్ని నిర్వహించారని కోలా. తెలిపారు. కార్యక్రమంలోపలువురుపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెన్న అలంకార ప్రియుడిగా కాలభైరవ స్వామి

నగరి, జూన్ 30 ప్రభాతవార్త:



నగరి పట్టణం ఈశ్వరాలయంలో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి విశేష అష్టమి పూజల సందర్భంగా ప్రత్యేక అభిషేక అర్చనలు జరిగాయి. తదుపరి వెన్న ముద్దలతో, పలువ రకాలైన ద్రాక్ష పండ్లతో స్వామివారికి అలంకరణ విచ్చేసిన భక్తులను విశేషంగా ఆకర్షించాయి. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని స్వామి వారికి విశేష అభిషేక, అర్చన పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, సభ్యులు, భక్తులకు తగు ఏర్పాట్లు కావించారు.

## వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు పట్టివేత

కేవీబీ పురం, జూన్ 30 ప్రభాతవార్త:

వాహనంతో పాటు ఎర్రచందనాన్ని పట్టుకున్న సంఘటన కేవీబీ పురం మండలంలోని రాగిగుంట వద్ద చోటుచేసుకుంది. ఎఫ్ఆర్‌వో లోకేష్ కథనం మేరకు... తమకు అందిన రహస్య సమాచారం మేరకు మండలంలోని రాగిగుంట వద్ద మాటు వేసి ఉండగా తమిళనాడుకు చెందిన బొలెరో వాహనంలో కివిన్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 18 ఎర్రచందనం దుంగలతో పాటు వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఎర్రచందనంతో పాటు వాహన విలువసుమారు నాలుగు లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి ముద్దాయిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో డీఆర్‌వో రామకృష్ణ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మాతమ్మ తిరుణాళ్లు

విజయపురం, జూన్ 30 ప్రభాతవార్త:



మండలంలోని విజయపురం అరుంధతివాడ, మ ల్లారెడ్డి కండ్రిగ, అరుంధతివాడలో ఆదివారం మాత మ్మ తిరుణాళ్ళను వైభవంగా నిర్వహించారు. విజయ పురంలో మాతమ్మ సేవలో ఎమ్మెల్యే గాలి భానుప్రకా ష్, మల్లారెడ్డి కండ్రిగలో చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు పాల్గొ న్నారు. భక్తులు ఉద యం మాతమ్మకు అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు. గెరిగెను ఊరేగించి సాయంత్రంఅగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. రాత్రి మాతమ్మను పురవీధుల్లో ఊరేగించారు. రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శిబాబు యాదవ్, నాయకులుబాలసుబ్రహ్మణ్యంరాజు, సుధాకర్‌రాజు, సమసింహారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులచే పెంచిన పెన్షన్ పంపిణీ

తిరుపతి కార్పొరేషన్, జూన్ 30, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ఇంటింటికి పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుచే నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అధితి సింగ్ పేర్కొన్నారు. ఉదయం5.45గంటలకు భవాని నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే మబ్బు రామిరెడ్డి సందులో, ఉదయం 6.30 గంటలకు గంగమ్మ గుడి ఆర్చ్ వద్ద, ఉదయం 7 గంటలకు కొర్లగుంట మెయిన్ రోడ్డు, హచ్ టవర్ వద్ద, ఉదయం 7.45 గంటలకు జీవకోనలోని జీవలింగేశ్వర స్వామి గుడి దగ్గర, ఉదయం 9.30 గంటలకు నెహ్రూ నగర్ మెయిన్ రోడ్డు, ఉదయం 10.30 గంటలకు ఇందిరానగర్, బాలాజీ థియేటర్ ఎదురుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుచే పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష కమిషనర్ అతిధి సింగ్ పాల్గొంటారు.

## మీ కోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కమిషనర్ అదితి సింగ్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 30, ప్రభాతవార్త



జూలై 1వ తేది సోమవారం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో మీ కోసం – ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇకపై ప్రతి సోమవారం మీ కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ తెలిపారు.

## 4న ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపిఈఏపి సెట్ కౌన్సెలింగ్

తిరుపతి విద్య, జూన్ 30, ప్రభాతవార్త

తిరుపతి ఎస్వీ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపిఈఏపి సెట్ 2024 కౌన్సిలింగ్ ఈ నెల 4వ తేది నుంచి ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని కోఆర్డినేటర్ తెలిపారు. అభ్యర్థులందరూ జూలై 1వ తేది నుంచి జూలై 7వ తేది లోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా కోఆర్డినేటర్ డా. వై. ద్వారకానాథ్ రెడ్డి కోరుతున్నారు. అలాగే అభ్యర్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలోనే తమ ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసుకోవాలని, అలా అప్లోడ్ చేసిన తర్వాత హెల్ప్ లైన్ సెంటర్‌లో ఆ సర్టిఫికేట్స్‌ని ఆన్‌లైన్ ద్వారా వెరిపై చేస్తామని, అందువల్ల అభ్యర్థులకు ఏదైనా సమస్య వస్తేనే హెల్ప్ లైన్ సెంటర్‌కి రావాలని కోఆర్డినేటర్ పేర్కొన్నారు. అలాగే జూలై 8వ తేది నుంచి 12వ తేది వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవచ్చుని, 13వ తేదిన వెబ్ ఆప్షన్స్‌లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చుని, జూలై 16న సీట్ అలాట్మెంట్ ఉంటుందని, జూలై 19వ తేదీ నుండి తరగతులు ప్రారంభమవుతాయని కోఆర్డినేటర్ తెలిపారు.

## ఐక్యమత్యమే మహాబలం

రాష్ట్ర అధ్యక్షులు, బలిజ సేన ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి హెల్త్, జూన్ 30, ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం వాయల్పాడులో బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గ బలిజ నాయకులతో ఆత్మీయ సమావేశం రిటైర్డ్ ఎస్ఐ శంకరయ్య నేతృత్వంలో ఏర్పాటు చేసారు. ముందుగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ పూజల మాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బలిజలు రాయలసీమ ప్రాంతంలో అత్యంత వెనుకబడి ఉన్నారని పేరుకు సంఖ్యాబలం ఉన్న అటు ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుదలకు నోచుకోలేదని తెలిపారు. బలిజలు ఐక్యమత్యంగా ఉండి ఒకరికిఒకరు పరస్పర సహకారం చేసుకుంటూ వెళ్లేనే అన్ని రంగాల్లో బలిజలు ముందగుచేయగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బలిజసేన అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్ర, పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు శంకరయ్య, మనోహర్, రామకృష్ణ, ఆనంద శేఖర్, వెంకటరమణ, వంశి, శ్రీనివాసులు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## నేడు పింఛన్ల పండగ

శ్రీకాళహస్తి, జూన్ 30 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌టీఆర్ సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమానికి సర్వం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం. రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం. రమేష్‌బాబు మాట్లాడుతూ జూలై 1వ తేదిన ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫించన్ల పంపిణీ చేపట్టడం జరుగుతుందని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్ళి రూ. 7వేలు నగదును అందించడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీని నోడల్ అధికారులు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో 8344 మంది లబ్ధిదారులున్నారని వారికి పెన్షన్లు అందించుటకు 155 మంది సచివాలయ సిబ్బంది నియమించినట్లు కమిషనర్ వివరించారు. సోమవారం సాయంత్రానికి పెన్షన్ల పంపిణి పూర్తి చేస్తామన్నారు.

## 17న మలయాళస్వామి పుస్తకావిష్కరణ

శ్రీకాళహస్తి, జూన్ 30 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలోని కొండల దిగువన వెలసిన సద్గురు మలయాళ స్వామి ఆశ్రమ స్థాపకులు మలయాళస్వామి పుస్తకావిష్కరణను ఈ నెల 17న ఏర్పాటు చేసినట్లు ఆదివారం జరిగిన సామాజిక సమరసత వేదిక సమావేశంలో వక్తలు వివరించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆధ్యాత్మిక చింతనకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు. సమితి అధ్యక్షుడు వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి నెల్లూరు నుంచి శ్రీధర్, బాలసుబ్రమణ్యం, సుబ్బరామిరెడ్డిలు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహనకు సంబంధించి వేదిక కృషి చేస్తుందన్నారు. స్థానిక సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు సంబంధించి పర్యవేక్షిస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మలయాళస్వామి చరిత్రను గ్రామ గ్రామాలకు తెలియజేయటానికి వేదిక నిర్ణయించిందన్నారు. ఈ మేరకు పుస్తకావిష్కరణను భారీ ఎత్తున నిర్వహించాలని ప్రతి గ్రామం నుంచి ఎంత మందిని సేకరిస్తారనే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో వేదిక అధ్యక్షులు వీరాస్వామి, కార్యదర్శి ఈశ్వరయ్య, చిలకారంగయ్య పాల్గొన్నారు. ఆవిష్కరణ కార్యక్రమాలను ఏర్పేడులోని వ్యాసాశ్రమం ఆవరణలో 17వ తేది సాయంత్రం 4 గంటలకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పుస్తకాన్ని ఆశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి ప్రధాన వక్తలుగా రాష్ట్ర ఆర్ ఎస్ ఎస్ కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్‌నాయుడు, సన్మాన స్వీకర్తగా సీనియర్ పాత్రికేయులు వల్లిశ్వర్‌లు హాజరౌతారని వివరించారు.

## వైద్యులు దేవుళ్ళతో సమానం

-యంగ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సత్కారం

తొట్టంబేడు, జూన్ 30 ప్రభాతవార్త



వైద్యులు దేవుళ్ళతో సమానం అని యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు హేమకుమార్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా శ్రీరాంనగర్ కాలనీలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన పలువురు వైద్యులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి హేమకుమార్ మాట్లాడుతూ తాము సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం, రథోత్సవంలో మజ్జిగపంపిణీ, చిన్నారులకు పాదరక్షలు పంపిణీ, ఏరియా ఆస్పత్రిలో రోగులకు దుప్పట్లు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ జయగోపాల్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికోసం తాము సహకారం అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించేందుకు తాము సిద్దంగా ఉన్నామన్నారు. ఎంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాహుల్‌రాజ్, డాక్టర్ స్రవంతి, గజేంద్రనగర్ పిహెచ్‌సి డాక్టర్ రూపేష్, భాస్కరపేట పిహెచ్‌సి ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ జయగోపాల్, నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొపెసర్ శరత్‌కృష్ణ, ఎంజిఎం ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వివేక్‌చైతన్య, కడపజిల్లా జమ్ములమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కె.దుర్గాప్రసాద్ తదితరులను దుశ్శాలువతో సత్కరించి మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ముఖేష్, పూజ, నారాయణ, శ్రీనివాసులు, చంద్రకాంత్, కాంగ్రెస్, ప్రదీప్‌కుమార్, మోక్షిత తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రజా సమస్యల పరిష్కారంలో బిజెపి చొరవ

బిజెపి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు

చంద్రగిరి, జూన్ 30 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కారంలో బిజెపి నాయకులు తమవంతు సేవలందించడంలో చొరవచూపాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.జగదీశ్వర నాయుడు అన్నారు. చంద్రగిరిలో ఆదివారం బిజెపి సీనియర్ నాయకుడు సక్కూర్ మునిగంగిరెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, బిజెపి, జనసేన ఆధ్వర్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో ప్రజల సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలన్నారు. బిజెపి నాయకత్వం అనుమతితోనే పార్టీ సభ్యత్వాలను అందించాలని అన్నారు. అదేవిధంగా బిజెపి జిల్లా ఇన్‌చార్జ్ ఆర్.విశ్వనాథ్ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు అమ్మకోసం చెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీ నాయకులు కూటమి ఎంఎల్‌ఏతో, నాయకులతోనూ సఖ్యతతో వుండాలన్నారు. జిల్లా కమిటీ అనుమతి లేకుండా అందించే సభ్యత్వాలు చెల్లవని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమునిని, నాయకులు టి.వై.సుబ్రమణ్యం యాదవ్, గాలి పుష్పలత, కె.హరినాధరెడ్డి, శ్రీదర్‌బాబు, దొరస్వామి, బ్రహ్మం, శంకర్ రెడ్డి, నవీన్, వెంకటశివారెడ్డి, ఈశ్వర్, చంఢీశ్వర్ రెడ్డి, నరేష్‌కుమార్ నాయుడు, కృష్ణమూర్తి, తిలక్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారికి పొంగళ్ళు

ఎంఎల్‌ఏ సతీమణి పులివర్తి సుధారెడ్డి సారె

చంద్రగిరి, జూన్ 30 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారికి నాగయ్యగారిపల్లి, కూచివారిపల్లి గ్రామస్థులు ఆదివారం పొంగళ్ళు సమర్పించుకున్నారు. ఎంఎల్‌ఏగా పులివర్తి నాని ఘనవిజయం సాధించడంతో అమ్మవారికి మ్రొక్కులు తీర్చుకోవడంలో భాగంగా ఆదివారం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఎంఎల్‌ఏ సతీమణి పులివర్తి సుధారెడ్డి సారెను మోసుకురాగా ఆమె వెంట ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద టిడిపి నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో పొంగళ్ళు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మ్రొక్కులు తీర్చుకున్నారు. మహిళలతో కలసి ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు తమ గ్రామాల నుండి కాలినడకన బయలుదేరి భాణా సంఛాపేళుళ్ళు, బ్యాండుభాజాలతో ఆలయానికి చేరుకున్నారు. తమ కుటుంబం, టిడిపి పట్ల ఇంతటి ఆదరణ చూపుతున్న ప్రజలకు పులివర్తి సుధారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీఅంకాల పరమేశ్వరికి నగరి ఎంఎల్ఏ సారె

రామచంద్రాపురం, జూన్ 30 ప్రభాతవార్త:



వెంకట్రామపురంలో వెలసియున్న శ్రీఅంకాల పరమేశ్వరి అమ్మవారికి నగరి ఎంఎల్ఏ గాలి భానుప్రకాష్ ఆదివారం సారెను సమర్పించారు. ఇందులో భాగంగా తన స్వగ్రామానికి విచ్చేసిన ఆయనకు గ్రామపెద్దలు గజమాలతో సత్కరించారు. మంగళతాళాలు, మంగళవాయిధ్యాలతో ఘనస్వాగతంపలికారు. ఆలయ పూజారికి సారెను సమర్పించి, ప్రత్యేక పూజలు జరిపించి మ్రొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వహకులు ఆలయనకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చినబాబు, అబ్బూరి దేవానందం నాయుడు, లీలామోహన్, మునిచంద్రనాయుడు, వెంకటపతి, దినేష్, ధనంజయ యాదవ్, సంజీవి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## అనిచెరువు గ్రామస్థులకు తీరిన దాహార్తి

రామచంద్రాపురం, జూన్ 30 ప్రభాతవార్త:



కొత్తకండ్రిగ పంచాయతీ, అనిచెరువు గ్రామస్థులకు మంచినీటి దాహార్తి తీర్చినట్లు మాజీ ఎంపిపి తానికొండ కేశవులు నాయుడు అన్నారు. ఆదివారం మంచినీటి బోరు మోటార్ మరమత్తులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. నాలుగేళ్ల క్రితం మరమత్తులకు గురైన బోరును వైసిపి ప్రభుత్వ హయాంలో ఎవరూ పట్టించుకున్నపాపానపోలేదన్నారు. గత ఎన్నికలలో ఎంఎల్‌ఏగా పులివర్తి నాని విజయం సాధించిన వెంటనే మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మాట ప్రకారం మంచినీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. దీంతో గ్రామస్థులు ఎంఎల్‌ఏ పులివర్తి నానికి, కేశవులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కుప్పం బాదూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ కోరా హరిప్రసాద్, నాయకులు దినేష్, కైలాసయ్య, సుందర్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పార్థసారధికి సిటీఛాంబర్ సన్మానం

తిరుపతి, జూన్ 30ప్రభాతవార్త:



రాష్ట్రసమాచారపౌరసంబంధాలశాఖమంత్రి పార్థసారధిని ఆదివారం ఉదయం తిరుపతిలో సిటీఛాంబర్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, వెటర్నరీ వర్సిటీ మాజీ పాలక మండలిసభ్యుడు డాక్టర్ కరుణానిధి కలిశారు. తిరుపతి పద్మావతి అతిధిగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. సిటీఛాంబర్ సేవా కార్యక్రమాలు, చేపట్టిన సేవలను అయూబ్‌ఖాన్, మధు వివరించారు .

## డిజిపిని కలసిన నైనారు

తిరుపతి, జూన్ 30ప్రభాతవార్త:



రాష్ట్ర పోలీస్ డిజిపి ద్వారకా తిరుమలరావును ఆదివారం విజయవాడలో మాజీ ఎంఎల్‌సి రామచంద్రయ్య, అటవీఅభివృద్ధి మాజీ డైరెక్టర్ నైనారు శ్రీనివాసులు కలిశారు. మర్యాదపూర్వకంగా కలసిన ఈ సందర్భంగా దుశ్శాలువతో సన్మానించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నాంచారయ్యకు ఆపస్ తరపున ఘన సన్మానం

తిరుపతి విద్య, జూన్ 30, ప్రభాతవార్త



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెస్ట్ తిరుచానూరు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి ఆదివారం ఉద్యోగ విరమణ చెందిన నాంచారయ్య సన్మాన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా విద్యా శాఖ అధికారి శేఖర్ విచ్చేయగా కార్యక్రమానికి విశిష్ఠ అతిధిగా విచ్చేసిన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ తమ సంఘం తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ నాంచారయ్య లాంటి ఉపాధ్యాయులు పదవి విరమణ చెందిన వారి యొక్క ఉత్తమ భావజాలం, ఉత్తమ వ్యక్తిత్వం వారి దగ్గర చదువుకున్నటువంటి పిల్లల్లో ప్రతిబింబిస్తాయని నవ సమాజ నిర్మాణంలో ఆదర్శ ఉపాధ్యాయుడిగా, ఉత్తమ విలువలతో నాంచారయ్య పనిచేశారని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘానికి మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ హోదాలలో తమ సేవలను నిబద్ధతతో అందించారని నాంచారయ్యను అభినందిస్తూ అతనిని దుశ్శాలువ, పండ్లు, వాల్మీకి రామాయణం గ్రంథం బహుకరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తూకివాకం నాగరాజు, గల్లా సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు డాక్టర్ దేవరాజులు, జిల్లా నాయకులు మహేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని సూచనలు ప్రజలకు ఉత్సాహం



దేశప్రధాని దేశప్రజలకు మన్‌కీ బాత్‌లో సూచనలు ఉత్సాహం కలిగిస్తా యని బిజెపి నేతలు అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్‌ను వీక్షించారు.

ప్రభాతవార్త-తిరుపతి

# ఉచిత వైద్య శిబిరంలో 350 మందికి పరీక్షలు

పుత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త :

ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గోపాలకృష్ణాపురంలోని ఎంపిపి స్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతికి చెందిన నారాయణాద్రి ఆస్పత్రి, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి, ఆపిల్ డెంటల్ కేర్ ఇంటర్నేషనల్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 350 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. బిసి, షుగర్, ఇసిజి, కంటి, దంత పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి



హెచ్.ప్రభాకర్‌రాజు, అతిథులుగా పుత్తూరు ఎంఇఒ తిరుమలరాజు, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు. ఆర్.రమేష్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో వాసర్ ఐ కేర్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ బాలకృష్ణ, నారాయణాద్రి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ చైతన్య, ఆపిల్ డెంటల్ కేర్ వైద్యులు డాక్టర్ ప్రియాంక, బెంగళూరుకు చెందిన ప్రముఖ ఫార్మసిస్ట్ సుధాకర్ వర్మ, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా సమన్వయకర్త కోనేటి రవిరాజు, అసోసియేషన్ అధ్యక్షుడు బి.బాబు, కార్యదర్శి రామ్మోహన్ వర్మ, ఉపాధ్యక్షుడఉ రమేష్‌నాయుడు, వాకర్స్ సభ్యులు రామచంద్రరాజు, ప్రసాదరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

# మహాభారతంలో అలరించిన దురోధ్యన వధ

**- యుద్ధంకు సై ... అంటే సై అంటూ తలపడిన భీమ, దుర్యోధనులు. అకట్టుకున్న గద, ముష్టి యుద్ధాలు**



తలపడుతున్న దుర్యోధన, భీమా పాత్రదారులు

వెదురుకుప్పం, జూన్ 30 ప్రభాతవార్త : మండలం కేంద్రంలోని చవటగుంట మహాభారత వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దురోధ్యన వధ కార్యక్రమం పలువురిని అలరించింది. కురుక్షేత్ర సంగ్రామం తరువాత శమంతక మడుగులో దాగిన దుర్యోధడు భీమా పాత్రదారులు యుద్ధంకు సై అంటే సై అంటూ మాటల తూటలతో వీక్షకులను అలరించారు. కురుక్షేత్ర సంగ్రామంలో శత సహోదరులను, గురువులను, స్నేహితులను, సర్వ సైన్యంను పోగొట్టుకుని ఒంటరిగా మిగిలిన దుర్యో ధనుడు శమంతక మడుగులో దాగి కురుక్షేత్ర యుద్ధంలో పోగొట్టుకున్న వారిని తిరిగి సంపాదించడంకు ప్రయత్నం చేయు ఘట్టమును శ్రీవెంకటేశ్వర నాట్యకళా మండలి కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి పలువురు ప్రశంసలు అందుకున్నారు. దుర్యోధను పాత్రదారుని, భీమా పాత్రదారి చవటగుంట మడుగు నుంచి మహాభారత ఆలయ ప్రాంగణంలో దుర్యోధన బొమ్మ వద్దకు దప్పుల దరువులు, బాణసంచ పేల్చూతూ తీసుకురావడం జరిగింది. శ్రీకృష్ణుని సాయంతో మడుగులలో దాగిన దుర్యోధనుడి సమాచారం తెలుసుకున్న పాండవులు శమంతక మడుగు వద్దకు చేరుకుని సూటిపోటీ మాటలతో బయటకు తీసుకురావడం ఇతిహాస ఘట్టంను పద్యాలు,పాటలు, ఛలోక్తులతో అభినయం చేశారు. భీమ, దుర్యోధన పాత్రదారులు గధ యుద్ధం, ముష్టి యుద్ధం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మండలంలోని గంటావారిపల్లెకు చెందిన బాలాజీ రెడ్డి భీమునిగా మారేపల్లెకు చెందిన దేవా దుర్యోధనుడుగా పాత్రలు ధరించి అద్భుత ప్రదర్శన చేసి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. దుర్యోధన వధ అనంతరం భక్తులు దుర్యోధన బొమ్మ బంక మట్టి గృహాల్లో ఉంచుకోవడం వలన లక్ష్మీ కటక్షం, ధన్యం వృద్ధి చెందుతుందని ప్రతీతి ఉండటంతో బంక మట్టి కొరకు పోటీ పడ్డారు. అనంరతం హరికథ భాగవతారిణి స్వర్ణలతచే ధర్మ రాజుల పట్టాభిషేకం కథను గానం చేశారు. మొండివెంగన పల్లె గ్రామం వారు కట్టెలు తీసుకువచ్చి ఆలయ ప్రాంగణంలో ఆగ్నిగుండ ప్రవేశంకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం ఆరు గంటలకు ఉపవాస దీక్షతో ఉన్న భక్తులు కంకణదారులై భక్తిశ్రద్దతలో స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అగ్ని గుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకుని తీర్ధప్రసాదాలు అందుకున్నారు. అగ్నిగుండ ప్రవేశం అనంతరం వెదురుకుప్పం గ్రామంకు చెందిన యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నేట నీరజా రాధా కృష్ణారెడ్డి, కార్యనిర్వహకులు ఆంజనేయులురెడ్డి, కృష్ణారెడ్డి, కొండారెడ్డి, నరసింహారెడ్డి, రామయ్య, జయరాం, ఆనందరెడ్డి, మోహన్ రెడ్డి, జీవన్ బాబు, హరినాధ రెడ్డి, భక్తులు తదితరులు పాలొన్నారు.

## ప్రతి ఇంటికి వచ్చి సమస్యను పరిష్కరిస్తా

**- చిత్తూరులో ఎమ్మెల్యే గురజాల వినూత్నంగా మార్నింగ్ వాక్**



సమస్యలు తెలుసుకోవడం కోసం మార్నింగ్ వాక్ కార్యక్రమం

చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త: ఇప్పటి వరకు చిత్తూరు నగర అభివృద్ధికి ఎవరేం చేశారనేది వద్దు. ఈ రోజు నుండి సమస్యలు తెలుసుకోవడం కోసం మీ ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ పేరిట మీ ఇంటికి వస్తున్నాడు. ఎద్దైనా సమస్యలు వుంటే నా దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ప్రజలను కోరారు. చిత్తూరు నగర సమస్యలను పరిష్కరించడం కోసం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆదివారం వినూత్నంగా మార్నింగ్ వాక్ పేరిట ప్రజల్లోకి వెళ్ళడానికి సిద్ధం అయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు 31, 32 డివిజన్ల పరిధిలోని రామ్‌నగర్‌కాలనీ, టెలిఫోన్‌కాలనీ, అర్టీసీ డిపో రోడ్డు తదితర ప్రాంతాల్లో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. స్థానికంగా వున్న మురికి కాలువలను పరిశీలించి మురికినీరు కాలువలో ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు, ఆర్ఓ గోపాలకృష్ణవర్మ, డిడి రమణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్... భవిష్యత్తుకు అనర్థం



బంగారమ్మ కాలనీ మలుపు వద్ద రోడ్డుపక్కనే పడేసి ఉన్న ప్లాస్టిక్

తొట్టంబేడు, జూన్ 30 ప్రభాతవార్త : బంగారమ్మ కాలనీ... ఈ కాలనీ ప్రధాన మార్గంలో ఓవైపు బంగారమ్మ అమ్మవారి ఆలయం, మరో పక్కన అభయ ఆంజనేయస్వామి ఆలయం, మరో వైపు నిలువెత్తు హనుమంతుని విగ్రహాలు ఉన్నాయి. అపక్కనే వళ్ళీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయం ఉంది. అయితే ఇవన్నీ దాటుకుని కూతవేటు దూరంలో ఓ మద్యం దుకాణం వెలసింది. మందుబాబులు కొట్టుకుంటూ మద్యం కొనుగోలు చేస్తారు. ఈమద్యం దుకాణం పక్కనే ఓ దుకాణం వెలసింది. మందుబాబులకు కావాల్సిన ఆహారపదార్థాలు దొరుకుతాయి. మరోపక్కనే ఇంకో దుకాణం వెలసింది. ఇక్కడైతే నియమనిబంధనలు లేవు. ఈదుకాణంలో మద్యం సేవించడం ఒక ఎత్తైతే మరోవైపు మందుబాబులు కొనుగోలు చేసిన ప్లాస్టిక్ గ్లాసులను దుకాణదారులు రోడ్డుపక్కనే పడేయడంతో ప్లాస్టిక్ భూతం వెంటాడుతోంది.ప్రస్తుతం ఈకాలని తొట్టంబేడు మండల పరిధిలో ఉన్నా పంచాయతీ కార్యదర్శి దుకాణదారులకు నోటీసులు కూడా ఇవ్వలేదు. ఇప్పటికే మురుగునీటి కాలువల్లోను వేలాదిగా ప్లాస్టిక్ బాటిళ్ళు దర్శనమిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ గ్లాసులు రోడ్డుమీదే పడేస్తుంటే కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలుమాక్క కాలనీ వాసులు మద్యం దుకాణాన్ని తొలగించాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా నివారించాలంటే అందరి సహకారం అవసరం. అంతేకాకుండా శ్రీకాళహస్తి పట్టణంలో కూడా నేటి నుంచి ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తున్నారు.

# రూ.45 లక్షల విలువైన 200 మొబైల్ పోన్లు రికవరీ

**- ఇప్పటి వరకు రూ.3.60 కోట్ల విలువైన 1,700 మొబైల్ ఫోన్లు స్వాధీనం - ఎస్పీ మణికంఠ చందోలు**



చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త: చిత్తూరు పోలీసులు చాట్ బూత్ ద్వారా ఆదివారం 45 లక్షల రూపాయల విలువైన 200 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఫోన్ల కోల్పోయిన యాజమానులకు అందించడం జరిగిందని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఎస్పీ మణికంఠ చందోలు విలేకరులతో మాట్లాడుతూ చాట్ బాట్ ద్వారా ఫోన్ల దొంగతనాలపై ఇప్పటి వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ఆరు దశల్లో 3.60 కోట్ల రూపాయల విలువైన 1,700 మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగిందన్నారు. పోలీసులకు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుండి ఇక్కడ చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి పట్టుకోవడం జరిగిందన్నారు. మారుతున్న జీవనశైలిలో మొబైల్ వినియోగం అధికం కావడంతో మొబైల్ ఫోను అనేది మనలో ఒకటిగా మారిందన్నారు. అలాంటి మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే వారి బాధ వర్ణనాతీతంగా వుంటుందన్నారు. అలాంటి మొబైల్ ఫోన్లను ఎలాంటి ఫిర్యాదు లేకుండా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఇంట్లో కూర్చొని చిత్తూరు పోలీసుల చాట్ బాట్ సేవల ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి పొందవచ్చునన్నారు. ప్రస్తుతం లభ్యమైన మొబైల్ ఫోన్లను చిత్తూరు క్రైమ్ ఇన్స్‌పెక్టర్ రామాంజ నేయులు, వాట్‌బాట్ సిబ్బంది బాషా, శ్రీనివాసన్‌ల ఆధ్వర్యంలో గుర్తించడం జరిగిందన్నారు. ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల నుండి స్వాధీనం చేసుకుని ఫోన్లు పోగొట్టుకున్న వారికి అందజేయడం జరిగిందన్నారు. మరికొన్ని మొబైల్ ఫోన్ల గుర్తింపు ప్రక్రియ జరుగుతుందని ఈ ప్రక్రియ పూర్తయితే మరిన్ని మొబైల్ ఫోన్లు రికవరీ అయ్యే అవకాశం వుందన్నారు.

## డయేరియా వ్యాధి పై హెల్ప్ లైన్ ఏర్పాటు:కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జూన్ 30 ప్రభాతవార్త: తాగునీటి కాలుష్యం వలన కలిగే డయేరియా వ్యాధిపై ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల కొరకు, అదే విధంగా డెంగ్యూ, మలేరియా వ్యాధుల ఫిర్యాదు, సహాయం కొరకు హెల్ప్ లైన్ నంబర్ 0877 - 2256766ను ప్రారంభించినట్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ ఆదివారం తెలిపారు. తిరుపతి నగర ప్రజలు డయేరియా సంబంధిత పిర్యాధులను, ఎక్కడైన నీరు కలుషితం అయినట్లు తెలిపినా 24 గంటల పాటు పని చేసే హెల్ప్ లైన్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదులను తెలుపవచ్చునని, ఇందుకోసం మూడు షిఫ్టుల చొప్పున తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. జూలై 10వ తేది వరకు ఫిర్యాదులను తెలుపవచ్చని కమిషనర్ అధితి సింగ్ తెలిపారు.

## ఉరకలెత్తించిన ఛత్రపతి శివాజీ మహరాజ్ శోభాయాత్ర



పట్టణంలో సాగుతున్న ర్యాలీ

పుంగనూరు,జూన్30 ప్రభాతవార్త : హిందూజాగరణతో పాటూ వివిధ హిందూ సంఘాలు ఐక్యంగా ఆదివారం నిర్వహించిన ఛత్రపతి శివాజీ స్రామాజ్యదినోత్సవ శోభాయాత్ర పట్టణంలో ప్రజలను ఉర్రూతలూగించింది. పట్టణంలో పదేళ్ళుగా హిందూ సంఘాలనీ ్న ఐక్యంగా నిర్వహిస్తున్న శోభాయాత్ర ఈదఫా మరింత దిగ్విజయంగా సాగింది. మొత్తం శోభాయాత్ర నిర్వహణకు ఎన్వీఆర్ ట్రస్టు ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి ముందుకు రావడంతో నానాసాహెబ్‌పేట మొత్తం కాషాయమయమైంది. నానా సాహెబ్‌పేటలోని శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయం వద్దనుంచి ఆదివారం సాయంత్రం ప్రారంభమైన శోభాయాత్రకు పట్టణ,గ్రామీణ ప్రాంతాల నుంచి వేలాదిగా యువకులు చేరుకున్నారు. కాషాయ కండువాలు,పేటాలు కట్టుకున్న హిందూజాగరణ సమితి సభ్యుల కోలాహలం మధ్యన ప్రారంభమైన శోభాయాత్రలో భాగంగా తొలుతశివాజీ చిత్రపటానికి పూజలు నిర్వహించి హారతులు పట్టారు. ఈసందర్భంగా డప్పులు వాయిద్యాల మధ్యన యాత్ర నానాసాహెబ్‌పేట, బజారువీధి, నగరివీధి, బజారువీధి, ఆర్యవైశ్యవీధి,తూర్పుమొగసాల,ఎంబిటి రోడ్డు, మున్సిపల్ బస్టాండు,గోకుల్‌సర్కిల్ ,అంబేద్కర్ సర్కిల్,కొత్తఇండ్లు, కొత్తపేట ప్రాంతాల వరకు నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న హిందువులు ఛత్రపతి మహారాజ్‌కు జై అంటూ నినాదాలు చేశారు.ఈయాత్ర మొత్తానికి ఆధ్వర్యం వహించిన హిందూ సంఘాల నాయకులు పట్టణంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులకు తావివ్వకుండా ర్యాలీ పూర్తిచేశారు. కాగా పట్టణంలో నిర్వహించిన ఈర్యాలీ సందర్భంగా ఎటువంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## కన్నుల పండువగా కోదండరాముని తెప్పోత్సవం



తెప్పలపై విహరిస్తున్న కోదండరాముడు

తవణంపల్లె, జూన్ 30 ప్రభాతవార్త: మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం శ్రీసీతా లక్ష్మణ సమేతుడైన కోదండరాముడు తెప్పలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయంలో ఈనెల 16 నుండి జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహనసేవలలో ఊరేగుతూ అలసి సొలసిన స్వామి, అమ్మవార్లు చివరిరోజు తెప్పలపై విహరిస్తూ సేదదీరారు. ఈమేరకు ఆదివారం స్వామివారికి తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి టి.పుత్తూరు చెందిన కెఎన్.యాగమూర్తి అండ్ సన్స్, రాయపాటి గణపతినాయుడు, బెంటుళూరుకు చెందిన ఉదయ్ కుమార్‌రెడ్డి, తవణంపల్లె రెడ్డెప్పరెడ్డి అండ్ సన్స్, పి.లోకనాథరెడ్డి అండ్ సన్స్, శంకర్‌రెడ్డి అండ్ సన్స్, ఐ.వేణు గోపాల్‌రెడ్డి అండ్ సన్స్‌లు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించగా సాయంత్రం ఊ ంజల్‌సేవ నిర్వహించారు. అలాగే రాత్రి శ్రీసీతా లక్ష్మణ సమేతంగా సర్వాలంకృతుడై వేదపండితుల మం త్రోచ్ఛారణ నడుమ అర్చక స్వాముల పూజలందుకున్న అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధరకాల పరిమళ పుష్పాలతో స్వామివారి పుష్కరిణిలో భారీ ఎత్తున ఏర్పాటు చేసి దేధీవ్యమానంగా అలంకరించిన తెప్పలపై వుంచి మూడు సార్లు ప్రదక్షిణ చేయించారు. ఈసందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్దేశ్వరరెడ్డి. ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. దేవస్థానంలో ఆదివారం జరిగిన తెప్పోత్సవంతో 15 రోజుల పాటు జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి.

## పోలీసు శాఖకు చేసిన సేవలు అభినందనీయం

**- ఎస్పీ మణికంఠ చందోలు**

చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త: పోలీసు శాఖకు మీరు చేసిన సేవలు అభినందనీయమని ఆదివారం పోలీసు శాఖ నుండి రిటైర్డ్ అయిన ముగ్గురు ఎఎస్ఐలు ఎం.మణి, ఎ.జయదేవరెడ్డి, జి.మునియప్పలను ఉద్దేశించి ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. పోలీసు శాఖ నుండి రిటైర్డ్ అవుతున్న ముగ్గురు ఎఎస్ఐలు, ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక హోమ్‌గార్డును శనివారం చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ మణికంఠ చందోలు సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలం శాఖలో క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తించి రిటైర్డ్ కావడం అభినందనీయమన్నారు. ఇకపై శేష జీవితంను ఆనందంగా గడపాలని వారితో ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. అలాగే పదవి విరమణ పొందిన హోంగార్డులు పట్టాభి, పరిమిళలకు ఎస్పీ మణికంఠ చందోలు హోం గార్డ్స్ బెనిఫిట్ ఫండ్ నుండి ఒకొక్కరికి రూ.4 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాధరెడ్డి, ఆర్ఐ ఎంటిఓ భాస్కర్, ఆర్ఐ హోమ్‌గార్డు సుధాకర్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండపై పోటెత్తిన భక్త జనం

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 30 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం ఆదివారం భక్తులతో పోటెత్తింది. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలిరావడంతో బోయకొండ భక్త జనసంద్రమైంది. వేదపండితులు, అర్చకులచే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరక క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ఇఓ చంద్రమౌళి, అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**- జిల్లా అధికారుల హాజరు తప్పనిసరి - కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త: కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రజలు సైతం తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు.

## పోలీసు సిబ్బంది సేవలు చిరస్మరణీయం



కానిస్టేబుల్ లోకయ్య దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

తవణంపల్లె, జూన్ 30 ప్రభాతవార్త: పోలీసు శాఖలో సుదీర్ఘకాలం క్రమశిక్షణతో బాధ్యయుతంగా విధులు నిర్వహించి పదవీ విరమణపొందిన సిబ్బంది సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు.తవణంపల్లె పోలీస స్టేషన్‌లో కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఎన్.లోకయ్యతో పాటు మరో ఐదు మంది పోలీసు అధికారులు, సిబ ్బందిని స్థానిక పోలీసు గెస్ట్‌హౌస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్ీ ్ప ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో లోకయ్య కుటుంబసభ్యులతో పాటు చిత్తూరు వన్‌టౌన్ సీఐ విశ్వనాధరెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డి కుటుంబాన్ని జిల్లా నుండి బహిష్కరించాలి



జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి

చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త: జిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం వల్ల శాంతిభద్రతలకు భంగం వాటిల్లే పరిస్థితులు నెలకొనడంతో ఆ కుటుంబంను జిల్లా నుండి బహిష్కరించాలని జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని, ప్రజలు తమకు 40 శాతం ఓట్లు వేశారని, నియోజకవర్గంలో పర్యటిస్తానని మాజీ మంత్రి పెద్దిరెడ్డి చెప్పుండటం విడ్డూరంగా వుందన్నారు. పుంగనూరు ప్రజలు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పుంగనూరులో అడుగు పెట్టవద్దని స్పష్టం చేస్తున్నప్పటికీ అక్కడికి వెళ్ళి మాజీ మంత్రి రచ్చ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మైనార్టీ సెల్ నాయుడు జాఫర్, బీసీ సెల్ ధరణీప్రకాష్, కృష్ణమూర్తియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వకుళామాత ఆలయ వార్షికోత్సవం



తిరుపతిరూరల్, జూన్ 30 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ పేరూరు బండపై వెలసిన శ్రీవకుళామాత ఆలయంలో ఆదివారం ఆలయ వార్షికోత్స ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవానికి పురస్కరించుకుని ప్రత్యేక పూజ కార్యాక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి తోమాల, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 8గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షబంధనం, అగ్ని ప్రతిష్ట, కలశారాధన, మహాశాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు అమ్మవారి ఉత్సవర్లకు అష్టోత్తర కలశాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, విజిఓ బాలిరెడ్డి, టెంపుల్ ఇన్స్‌ప్పెక్టర్ శివకుమార్ ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవకుళమాత అమ్మవారికి కవచాలు బహుకరణ

తిరుపతిరూరల్, జూన్ 30 ప్రభాతవార్త: శ్రీవకుళమాత అమ్మవారికి పాతకాల్వకు చెందిన ఉంగరాల సుబ్రమణ్యం అనే భక్తుడు రూ.1.24 లక్షలు విలువైన బంగారు పూత పూయబడిన కవచాలను విరాళంగా అందించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీవకుళమాత ఆలయంలో ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మికి దాత ఈ కవచాలను బహుకరించారు.

## మంత్రి పార్ధసారధికి పుష్పావతి యాదవ్ అభినందనలు



తిరుపతి,జూన్ 30ప్రభాతవార్త: రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి పార్ధసారధిని ఆదివారం తిరుమలలో టిడిపి రాష్ట్రకార్యదర్శి వి.పుష్పావతి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో టిడిపి నాయకులు మరింతగా కృషి చేయాలని సూచించారు. ఆదివారం ఉదయం తిరుమలలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పావతియాదవ్ కుటుంబం దుశ్శాలువతో సన్మానించి,అభినందనలుతెలిపారు.

## శ్రీవారి ఆశీస్సులందుకున్నాం



తిరుమల,జూన్ 30ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారిని ఆదివారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ వేర్వేరుగా విఐపి బ్రేక్‌లో స్వామివారి ఆశీస్సులందుకున్నారు.

## భారత్ క్రీడాకారులకు మద్దతుసంబరాలు



తిరుపతి,జూన్ 30ప్రభాతవార్త: వెస్టిండీస్ వేదికగా జరిగిన టి 20 క్రికెట్ వరల్డ్‌కప్ ఫైనల్స్‌తో భారత్ క్రికెట్ జట్టు ఘనవిజయం సాధించడంతో తిరుపతిలో బిజెపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఉత్కంఠపోరులో భారత్ క్రీడాకారులు పోరాడి విజయం సాధించడంతో ఆదివారం ఉదయం బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, సవిత, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, దీపక్‌యాదవ్, మల్లారపు రవిప్రసాద్, కళావతి, గురునాథనాయుడు, రమేశ్‌శెట్టి తదితరులు జాతీయ జెండాను చేతబట్టి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. టి 20 వరల్డ్ కప్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ బారత్ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆస్పత్రి సేవలు అభినందనీయం

**- సినీనటులు సుమన్**



సుమన్‌ని సత్కరిస్తున్న శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల వైద్య బృందం

రేణిగుంట, జూనక్ష్ 30 ప్రభాతవార్త: శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీ అనుసంధాన ఆస్పత్రి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నదనిప్రముఖ సినీ నటుడు సుమన్ కితాభిచ్చారు. రేణిగుంట విమానాశ్రయంకి వెళ్లే మార్గంలో ఉన్న శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల, వైద్యశాలలను ఆదివారం ప్రముఖ సినీ నటుడు సుమన్‌సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారికి ఆస్పత్రి వర్గాలు ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి యాజమాన్యం, వైద్యుల ద్వారా అత్యాధునిక వైద్య పరికరాలపై ఆరా తీశారు. ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు, వైద్య సిబ్బంది పేద మధ్య తరగతి ప్రజలకు చేస్తున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తపరచారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అతి తక్కువ ధరలకు అందిస్తున్న శ్రీ బాలాజీ మెడికల్ ఆస్పత్రి యాజమాన్యాన్ని, వైద్యులను, సిబ్బందిని సుమన్ అభినందించారు. అనంతరం మెడికల్ కళాశాల సీఈవో పాణిగ్రాహి, ఆస్పత్రి డైరెక్టర్ రాకేష్‌కుమార్, జేఈవో నవీన్‌కుమార్‌రెడ్డి, డా. నాగరాజు, ఆస్పత్రి వైద్య బృందం, సిబ్బంది సినీ నటుడు సుమన్‌ను ఘనంగా సత్కరించారు.

# అనవసర సామగ్రి అంటగడితే కఠిన చర్యలు

**భక్తులను మోసగిస్తే దుకాణాలు సీజ్**



ఆలయంలో దుకాణాలు

శ్రీకాళహస్తి,జూన్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి భావంతో వస్తున్న భక్తుల్ని మభ్యపెట్టి వారికి అనవసర పూజా సామగ్రిని అ ంటగట్టి మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని మాట వినక పోతే దుకాణాలు సీజ్ చేయబడుతుందని శ్రీకాళహస్తీశ్వరాలయానికి పరిసరాల్లోని పలు దుకాణాలకు దేవస్థానం సెక్యూరిటి సిబ్బంది హెచ్చరిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయాని నిత్యం తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర ఉమ్మడి తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు వేలాది మంది వస్తుంటారు. వీరు మొదటి గోపురం బిక్షాల గాలిగోపురం, రెండవ గోపురం శివయ్య గోపురం నుంచి ప్రవేశిస్తుంటారని వారిని కొందరు రోడ్డు పక్కన టేబుళ్ళను ఏర్పాటు చేసుకొని పాదరక్షలు భద్రపరచబడుతుందని మభ్యపెట్టి పూజలకు అవసరం లేని సామగ్రిని అంటకడుతూ మోసగిస్తున్నారనే ఆరోపణలు న్నాయి. గతంలో కూడా వీరిని కట్టడి చేయటానికి పాలకులు, పోలీసులు ప్రయత్నించారు. కొంత కాలం సద్దుమణిగిన వివాదాలు మళ్ళీ మొదటికొచ్చాయి. కొందరు వ్యాపారులు భక్తులను అడ్డగించి వారిని మభ్యపెట్టి పూజలకు సంబంధించి వివరించి వారి చేతిలో ఆలయంలో పూజలకు ఉపయోగించని సామగ్రిని చేతిలో పెట్టి వందలు గుంజుతున్నట్లు ఆరోపణలున్నాయి. బిక్షాల గాలిగోపురం నుంచి రంగుల గోపురం వరకు రెండవ గోపురం ప్రారంభం నుంచి పాతాళవినాయకుని ఆలయం వరకు పలు దుకాణాలు వెలసి ఉన్నాయి. వాటన్నింటిని తొలగించుటకు నిర్ణయించారు. ఇక్కడ మాస్టర్ ప్లాన్ అమలు జరుగుతుంది కాబట్టి దుణాలను తొలగించాలని ఆదేశించారు. రెండు రోజులుగా వ్యాపారులు నాయకుల వద్దకు పరుగులు తీస్తున్నారు.

**మా బతుకు జీవనం ఎట్టా?**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో పలువురు రోడ్డు పక్కన టేబుళ్లు ఏర్పాటు చేసుకొని పూజా సామగ్రి అంటూ విక్రయాలు జరుపుతున్నారు.వారు భక్తులకు అందించే పూజా సామగ్రి ఆలయంలో ఉపయోగించరు. కానీ భక్తుల చేతుల్లో వస్తువులు పెట్టి డబ్బులు గుంజుకుంటున్నారు. ఈ దుకాణా దారులు ఈ వ్యాపారుల మీదనే ఆధార పడి జీవిస్తున్నారు.కఠిన ఆంక్షలతో వ్యాపారులు బెంబేలెత్తి పోతున్నారు. నాయకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకున్న కొందరు మాస్టర్ ప్లాన్ అమలు కోసం తమ ఇళ్ళను అప్పగించారు. నష్టపరిహారం తీసుకున్నారు. అయితే నష్టపరిహారం హారతి కర్పూరంలా కరిగిపోయిందని ఇళ్ళు కోల్పోయి నిరాశ్రయులమయ్యామని తమకు మొదట ఆలయం నిర్మించే షాపింగ్ కాంప్లెక్సులో అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారని కానీ తరువాత నష్టపరిహారంతోనే సరిపెట్టారని వాపోతున్నారు. వ్యాపారాలను నమ్ముకొని తాము కుటుంబాలను పోషించుకుంటున్నామని జీవనాధారాన్ని మూసివేస్తే తమ బిడ్డల చదువుల పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. కానీ భక్తిభావంతో వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధానాలకు పాలకులు ససేమిరా అంటున్నారు.మరి ఈ సమస్య ఎలా పరిష్కారమౌతుందో వేచి చూడాలి